www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
అనంతపురము జిల్లా / శ్రీ సత్యసాయి జిల్లా

## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ను కలిసిన కోనేపల్లి గ్రామస్తులు





**గుంతకల్,జూన్08.అక్షర టైమ్స్:-ప్రతినిధి గుమ్మనూరు హరి:** గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ను ఆయన స్వగృహం నందు పామిడి మండలం కోనేపల్లి గ్రామస్తులు ఉత్తర కాలువ కమిటీ సభ్యులు ఓబుళయ్య ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ను కలిసి గ్రామం లో చిన్న చిన్న సమస్యలు డ్రైనేజి కాలువలు మరియు కల్వర్ట్ లు అక్కడక్కడా సీసీ రోడ్లు వేయించి గ్రామ అభివృద్ధి కి సహకరించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ను విన్నవించారు స్పందించిన ఎమ్మెల్యే కచ్చితంగా మీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు..అలాగే ఎన్నో సంవత్సరాలనుండి రౌడీ షీట్ లు వున్న గ్రామస్తులను ఎమ్మెల్యే కృషి తో రౌడీ షీట్ తీసివేసిన సందర్భంగా గుమ్మనూరు జయరాం ని ఘనంగా సన్మానించి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో ఓబుళయ్య, కిషోర్, బాలం కృష్ణయ్య, వై. రామకృష్ణ, బోయ రాముడు, జూటూరు రామాంజనేయులు, రామచంద్ర, రామకృష్ణ, రాజు, చిన్న ఓబుళయ్య, హరి,చంద్రశేఖర్, రాజు, రామకృష్ణ, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## హామీలతో అధికారంలోకి... మోసాలతో కూటమి పాలన"

- డీఎస్సీ లేదు... హామీలు లేవు.. ప్రశ్నిస్తే కేసులే
- ఇదే రెండేళ్ల వెన్నుపోటు కూటమి పాలన?
- మాజీ మంత్రి నియోజకవర్గ సమన్వయకర్త డా. సాకే శైలజానాథ్
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి







**అనంతపురం,జూన్08.అక్షర టైమ్స్:** రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, రెండేళ్ల పాలనలో హామీలను గాలికొదిలేసి ప్రజలను మోసం చేసిందని జిల్లా పార్టీ అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి, శింగణమల నియోజకవర్గ సమన్వయకర్త డా. సాకే శైలజానాథ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు నిరసనగా గార్లదిన్నె మండలం కల్లూరు బైపాస్ కూడలిలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి డా. సాకే శైలజానాథ్, నియోజకవర్గ పరిశీలకులు ఎల్.ఎం. మోహన్ రెడ్డి, వైయస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు నారాయణరెడ్డితో పాటు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో సంక్షేమ పాలన అందిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీల ప్రభుత్వంను వెన్నుపోటు ప్రభుత్వంగా అభివర్ణించారు. గతంలో మేము అభివృద్ధి చేయడం కోసం పోటీ పడితే ఇప్పటి కూటమి ప్రజాప్రతినిధులు దోపిడీ చేయడంలో పోటీ పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వైఎస్సార్సీపీ కార్యకర్తలు కేసులకు భయపడరని, ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలను మోసం చేసిన ఈ రెండేళ్ల పాలనకు తగిన సమాధానం చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని, ప్రజల తీర్పే అంతిమమని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలో త్వరలోనే రానున్నాయని, గ్రూపులు వీడి సమన్వయంతో అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలన్నారు. ఓటర్ల మార్పులు చేర్పుల్లో భాగంగా ప్రభుత్వం ఎస్ఐఆర్ నిర్వహిస్తోంది, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు ఉండేలా చేసుకోవాలన్నారు. అనంతరం మాజీ మంత్రి డా. సాకే శైలజానాథ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ప్రజలు ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పాల్సింది పోయి కేసులు పెట్టి భయపెట్టే రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతకు ఆశలు కల్పించిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను గాలికొదిలేసిందన్నారు. లక్షలాది మంది యువత డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నా ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తూ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రజల పక్షాన పోరాడే వైఎస్సార్సీపీ ఎప్పటికీ వెనక్కి తగ్గదని, కేసులకు భయపడదని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ ఒక సింహం లాంటి పార్టీ అని, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుడని పేర్కొన్నారు. అధికార బలంతో ప్రతిపక్షాన్ని అణచివేయాలని చూస్తున్న కూటమి నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

**"జూన్ 12న భారీ నిరసన ర్యాలీ"**

"వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12వ తేదీన నియోజకవర్గ మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 723 మంది లబ్ధిదారులకు పొజిషన్ పత్రాలు పంపిణీ చేసిన మంత్రి సవిత

- ప్రజాదర్బార్ లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన మంత్రి సవిత





**పరిగి/హిందూపురం,జూన్08.అక్షర టైమ్స్:** ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి సవిత పేర్కొన్నారు. పరిగి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు.వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులు, అభ్యర్థనలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారుల ద్వారా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు పారదర్శకంగా అందేలా కృషి చేస్తున్నామని, ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకునేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు.త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ హౌసింగ్ పథకం కింద ఇళ్లు, సామాజిక భద్రతా పెన్షన్లు అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల నుంచి అందిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం 723 మంది లబ్ధిదారులకు ఇంటి పొజిషన్ పత్రాలను మంత్రి సవిత పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనందరావు, సాగర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ, ఎంపీడీవో రెడ్డప్ప వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల దందా.! తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు.!

- ఉరవకొండ ఏ.వీ.ఆర్ స్కూల్ ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన
- అక్రమంగా నిలువ ఉంచిన పాఠ్యపుస్తకాల గదిని సీజ్
- విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం: ఎంఈఓ ఈశ్వరప్ప




ఉరవకొండ,జూన్08.అక్షర టైమ్స్: ఉరవకొండ పట్టణంలోని ఏవీఆర్ ప్రైవేట్ పాఠశాలలో అక్రమంగా పాఠ్యపుస్తకాల విక్రయిస్తున్నారని, పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, విద్యార్థుల తల్లిదండ్రులను తాము సూచించిన నిర్దిష్ట ధరలకే పాఠశాల నుంచే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తోందనే సమాచారంతో విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం పాఠశాల ఎదుట భారీ ఆందోళన చేపట్టారు.

**విద్యను వ్యాపారంగా మార్చేశారు..**

ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. పాఠశాలల పేరుతో విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చి, తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారం మోపడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ప్రైవేట్ యాజమాన్యాలు బేఖాతరు చేస్తున్నాయని ఆరోపించారు. మార్కెట్‌లో తక్కువ ధరలకే లభించే పుస్తకాలను కొనుగోలు చేసే స్వేచ్ఛ కూడా తల్లిదండ్రులకు లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. ప్రతి ఏటా పుస్తకాల పేరుతో వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని, పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు అప్పులు చేసి మరి పుస్తకాలు కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై ఒత్తిడి తెస్తూ తల్లిదండ్రులను బలవంత పెట్టే ఈ విధానాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ?పాఠశాల ఎదుట ఆందోళన జరుగుతున్న విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) ఈశ్వరప్ప త్వరితగతిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదుల రావడంతో అక్కడ అక్రమంగా నిలువ ఉంచిన పాఠ్యపుస్తకాల గదిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల పరిధిలో పాఠ్యపుస్తకాల విక్రయం పై సమగ్ర విచారణ చేపడతామని, తల్లిదండ్రులపై అనవసర ఆర్థిక భారం మోపే చర్యలను విద్యాశాఖ ఎంతమాత్రం సహించబోదని స్పష్టం చేశారు.

**కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలి..**

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రతి ఏడాది ఫీజులతో పాటు పుస్తకాల పేరుతో దోపిడీ జరుగుతోందని, మార్కెట్ ధరల కంటే రెట్టింపు ధరలకు ఇక్కడ విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను సేవగా చూడాల్సిన సంస్థలు వ్యాపార ధోరణి వీడాలన్నారు. అధికారులు, ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని ప్రైవేట్ పాఠశాలలపై సమగ్ర విచారణ జరపాలని, అక్రమాలకు పాల్పడే పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు హిరణ్య, గణేష్, పృథ్వి పాల్గొన్నారు.

## ఐచర్ వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం






**ముదిగుబ్బ,జూన్08.అక్షర టైమ్స్:** శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండల కేంద్రంలో సోమవారం రాత్రి విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముదిగుబ్బ--కదిరి బైపాస్ రోడ్డులో రాఘవేంద్ర హోటల్ సమీపంలో రాత్రి సుమారు 8 గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం మేరకు మృతుడు కాలినడకన వెళుతుండగా వేగంగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఢీకొన్న ప్రభావానికి వ్యక్తి తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే ముదిగుబ్బ అప్‌గ్రేడ్ సీఐ శివరాముడు ఆదేశాల మేరకు ఎస్సై కేతన్న తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, అతని గుర్తింపునకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వేమన కళ్యాణమండపం నిర్మాణానికి మరో రూ.2.50 లక్షల విరాళం

- సేవా భావానికి నిలువెత్తు నిదర్శనంగా దేవరింటి కుటుంబం
- మొత్తం రూ.8 లక్షలు అందజేసిన దాతలు
- సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి
- రెడ్డి వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు దేవరింటి భాస్కర రెడ్డి












**కదిరి,జూన్08,అక్షర టైమ్స్:** కదిరిలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్టాత్మక వేమన కళ్యాణమండపం నిర్మాణానికి దాతల సహకారం నిరంతరం కొనసాగుతోంది. సమాజ సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండే దేవరింటి భాస్కర రెడ్డి, శ్రీమతి డి. నిర్మల మరియు వారి కుమార్తె డి. బిందు మాధవి కుటుంబ సభ్యులు మరోసారి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.వేమన కళ్యాణమండపం నిర్మాణం కోసం రూ.12 లక్షల విలువైన ఒక గదిని నిర్మించేందుకు ముందుకొచ్చిన ఈ కుటుంబం, ఇప్పటికే పలువిడతల్లో విరాళాలు అందజేస్తూ వస్తోంది. ఈ క్రమంలో 4వ విడతగా రూ.2.50 లక్షల విరాళాన్ని కదిరి రెడ్డి వెల్ఫేర్ సొసైటీ ఖాతాకు జమ చేశారు. దీంతో ఇప్పటి వరకు వారు అందజేసిన మొత్తం విరాళం రూ.8 లక్షలకు చేరుకుంది.సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కేంద్రబిందువుగా నిలిచేలా వేమన కళ్యాణమండపాన్ని అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్నట్లు సొసైటీ ప్రతినిధులు తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికి ఉపయోగపడే విధంగా ఈ కళ్యాణమండపం రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు.దేవరింటి భాస్కర రెడ్డి కుటుంబం అందిస్తున్న సహకారం ఇతరులకు స్ఫూర్తిదాయకమని రెడ్డి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కొనియాడారు. సమాజం పట్ల బాధ్యతతో ముందుకు వచ్చి పెద్ద మొత్తంలో విరాళాలు అందించడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి దాతల సహకారంతోనే నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.వేమన కళ్యాణమండపం నిర్మాణం ప్రస్తుతం తుది దశకు చేరుకుంటోందని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రతి సభ్యుడు తన వంతు సహకారం అందించాలని సొసైటీ విజ్ఞప్తి చేసింది. సమాజ అభివృద్ధి కోసం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమంలో సభ్యులందరూ భాగస్వాములు కావాలని కోరింది.ఈ సందర్భంగా దేవరింటి భాస్కర రెడ్డి మాట్లాడుతూ, సమాజ సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. వేమన కళ్యాణమండపం భవిష్యత్ తరాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తిగా నిలుస్తుందని, అందుకే దీనిని విజయవంతంగా పూర్తి చేయడం ప్రతి సభ్యుడి బాధ్యత అని అన్నారు. సమాజ ఐక్యతకు, సేవా భావానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ నిర్మాణానికి దాతల నుంచి మరింత ఆదరణ లభించాలని రెడ్డి వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు దేవరింటి భాస్కర్ రెడ్డి ఆకాంక్షించారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)-2026 ఓటరు జాబితా సవరణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

- ఓటు హక్కు పవిత్రమైనది... ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండాలి: మంత్రి సత్యకుమార్ యాదవ్
- పారదర్శక ఓటరు జాబితా కోసం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=)-2026 కీలకం
- ఓటరు జాబితా సవరణపై నాయకులు,కార్యకర్తలకు మంత్రి అవగాహన కార్యక్రమం






**ధర్మవరం,జూన్08.అక్షర టైమ్స్:** ధర్మవరం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో సోమవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=)-2026 ఓటరు జాబితా సవరణపై నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు వెన్నెముక వంటిదని, ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటు హక్కు పొందేలా చూడటం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థ మరింత పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఉండేందుకు భారత ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=)-2026 కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రస్తుతం ఓటరు జాబితాల్లో మరణించిన వారి పేర్లు కొనసాగడం, ఒకే వ్యక్తికి రెండు ప్రాంతాల్లో పేర్లు ఉండడం, నివాసం మారిన వారి వివరాలు మార్పు కాకపోవడం, కొత్తగా అర్హత పొందిన యువత పేర్లు నమోదు కాకపోవడం వంటి సమస్యలను పరిష్కరించడమే ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువకుడు, యువతి ఓటరుగా నమోదు కావడానికి అవకాశం కల్పించబడుతుందని మంత్రి తెలిపారు. అలాగే ప్రతి ఓటరు వివరాలు పూర్తిగా పరిశీలించి సరైన జాబితా రూపొందించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని అన్నారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) కార్యక్రమం అమలు విధానాన్ని వివరిస్తూ...

ప్రత్యేకంగా నియమించబడిన బూత్ లెవల్ అధికారులు (దీూాలు) ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తారని తెలిపారు. ఓటర్ల పేర్లు, చిరునామాలు, కుటుంబ వివరాలు మరియు ఇతర అవసరమైన అంశాలను ధృవీకరిస్తారని చెప్పారు. అలాగే ఆఫ్‌లైన్ విధానంలో బిఎల్వో లకు నేరుగా ఫారాలు అందించవచ్చని, ఆన్‌లైన్ ద్వారా ఎన్విఎస్పి వెబ్‌సైట్ ద్వారా కూడా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉందని వివరించారు.

**బిఎల్.వో ల బాధ్యతల గురించి మంత్రి మాట్లాడుతూ..**

బూత్ పరిధిలో ప్రతి ఇంటిని సందర్శించి సమాచారాన్ని సేకరించడం, ఓటర్ల వివరాలను ధృవీకరించడం, కొత్త ఓటర్లను గుర్తించడం, ఓటరు జాబితాలో పొరపాట్లు ఉంటే వాటిని సరిచేయడం, అవసరమైన ఫారాలు అందించడం వంటి బాధ్యతలు బి.ఎల్.వో లకు ఉంటాయని తెలిపారు. అలాగే బిఎల్ఎ-1 మరియు బిఎల్ఎ-2 వ్యవస్థ గురించి కూడా మంత్రి కార్యకర్తలకు వివరించారు. బిఎల్ఎ-1 (దీశీశీష్ట్ర ూవజవశ్రీ ూాస్త్రవత్-1) పార్టీ తరఫున నియమించబడే ప్రతినిధి అని, ఎస్ఐఆర్ ప్రక్రియను సమన్వయం చేయడం, బూత్ స్థాయిలో సమాచారాన్ని పరిశీలించడం,బిఎల్ఎ -2లను నియమించడం మరియు కార్యకర్తలకు అవసరమైన సూచనలు అందించడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. బిఎల్ఎ -2 (దీశీశీష్ట్ర ూవజవశ్రీ ూాస్త్రవత్-2) బూత్ స్థాయిలో నేరుగా ప్రజలతో పనిచేస్తూ ఓటరు వివరాలను పరిశీలించడం,బి.ఎల్.వో లతో సమన్వయం చేయడం, కొత్త ఓటర్ల నమోదులో సహాయం చేయడం, అవసరమైన చోట ఫారం-6 (కొత్త ఓటరు నమోదు), ఫారం-8 (సవరణలు) వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారని వివరించారు. ఓటరు జాబితా కేవలం ఒక రికార్డు మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్యానికి పునాది అని అన్నారు. ఓటరు జాబితా ఖచ్చితంగా ఉంటేనే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా మిగలకుండా, అనర్హుల పేర్లు ఉండకుండా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్‌ను సమర్థవంతంగా నిర్వహించి, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు జి.ఎం.శేఖర్, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, సర్ అసెంబ్లీ ఇంచార్జ్ ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు, మార్కెట్ యార్డ్ ఛైర్పర్సన్ అంబటి అరుణశ్రీ, సీనియర్ నాయకులు అంబటి సతీష్, జడ్పిటిసి కోటి సుధా, నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు జింకా చంద్రశేఖర్, అంజనరెడ్డి, గొట్లూరు చంద్ర, ఆకులేటి భాస్కర్,బిఎల్ఎ -2 లు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ ప్రతినిధులు మరియు పలువురు హాజరై పాల్గొన్నారు.

# రైతుల నెత్తిన132 కేవీ విద్యుత్ లైన్ రాజకీయ వికృత క్రీడలకు రైతులు బలి

- ఐదేళ్లు గడిచినా నష్టపరిహారం జాడలేదు.!
- గరడంపల్లి--తారకరామాపురం విద్యుత్ లైన్ బాధిత రైతు ఎం.కాంతమ్మ ఆవేదన

**ధర్మవరం,జూన్08.అక్షర టైమ్స్:** ధర్మవరం నియోజకవర్గంలోని గరడంపల్లి నుంచి తారకరామాపురం వరకు నిర్మిస్తున్న 132 కేవీ విద్యుత్ లైన్ పనులు 2021లో ప్రారంభమైనప్పటికీ, భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి నష్టపరిహారం కూడా అందలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల విలువ చేసే తమ భూములను విద్యుత్ లైన్ పేరుతో వినియోగించుకుంటూ, రైతుల హక్కులను మాత్రం ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని మండిపడుతున్నారు.

**భూములు తీసుకున్నారు... పరిహారం మాత్రం మరిచిపోయారు**

విద్యుత్ లైన్ టవర్లు, వైర్లు ఏర్పాటు కోసం వ్యవసాయ భూములను వినియోగించుకున్న అధికారులు, పనులు పూర్తయిన తర్వాత రైతుల సమస్యలను పట్టించుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం హామీలు ఇచ్చి కాలయాపన చేయగా, ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం కూడా అదే నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తోందని రైతులు విమర్శిస్తున్నారు.

**గత ప్రభుత్వానికి రైతులు గుర్తు రాలేదు... ఈ ప్రభుత్వానికి కూడా పట్టదా?**

రైతుల ప్రకారం, విద్యుత్ లైన్ నిర్మాణ సమయంలో నష్టపరిహారం చెల్లిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆ హామీలు గాలిలో కలిసిపోయాయని వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారినా రైతుల పరిస్థితి మాత్రం మారలేదని, పాలకులు మారినా పాలనా తీరు మాత్రం మారలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.




**కోట్ల విలువైన భూములు ఉచితంగా కావాలా?**

ప్రభుత్వ అవసరాల కోసం మా భూములను వినియోగించుకోవచ్చు. కానీ మా హక్కులను కాలరాయడం ఎందుకు? కోట్ల రూపాయల విలువ చేసే భూములను అప్పనంగా తీసుకుని, నష్టపరిహారం ఇవ్వకుండా వదిలేస్తే మా కుటుంబాలు ఎలా బతకాలి?" అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న తమకు ఈ పరిస్థితి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెట్టిందని వాపోతున్నారు.

**రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చి... రైతులనే మర్చిపోయారా?**

రైతు సంక్షేమమే తమ ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని చెప్పుకునే రాజకీయ పార్టీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత బాధిత రైతుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో రైతు పక్షపాతులమని చెప్పిన నేతలు, ఇప్పుడు రైతుల గోడును వినిపించుకోకపోవడం విచారకరమని అంటున్నారు.

**పరిహారం చెల్లించే వరకు ఉద్యమమే మార్గం?**

తక్షణమే భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఆందోళనలు, నిరసన కార్యక్రమాలకు దిగాల్సి వస్తుందని



హెచ్చరిస్తున్నారు. రైతుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలు, వారి కష్టాలను విస్మరిస్తే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రైతుల ఈ ఆవేదనకు ప్రభుత్వం ఎప్పుడు స్పందిస్తుందో, నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న బాధితులకు న్యాయం ఎప్పుడు జరుగుతుందో చూడాల్సి ఉంది.

# స్కూటీపై ప్రయాణం చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

- నాయకులతో కలిసి స్కూటీపై వెళ్లి అభివృద్ధి పనులను పరిశీలించిన సునీత
- కనగానపల్లి మండల నాయకులకు ఎస్ఐఆర్ పై అవగాహన
- ప్రతి ఓటు కీలకమే.. ఎవరూ నిర్లక్ష్యంగా ఉండవద్దు
- ఎస్ఐఆర్ పై ఎమ్మెల్యే సునీత క్యాడర్ కు దిశానిర్దేశ్యం





**అనంతపురం,జూన్08.అక్షర టైమ్స్:** ఇంధన పొదుపుపై సందేశం ఇస్తూ.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్కూటీ పై ప్రయాణించారు. సోమవారం ఆమె పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అయితే ఎప్పటిలా వాహనాల్లో వెళ్లకుండా టీడీపీ నాయకులతో కలిసి స్కూటీపై ప్రయాణం చేశారు. కనగానపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో 1.25 కోట్ల ఎస్.ఎస్.ఏ నిధులతో నిర్మిస్తున్న అదనపు తరగతి భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. పాఠశాలలు 12వ తేది నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు. పనులు కూడా త్వరితగతిన, నాణ్యతగా ఉండాలన్నారు. అనంతరం కస్తూరిబా బాలికల పాఠశాల నుంచి స్కూటీ పై స్థానిక చెరువు వరకు ప్రయాణించారు. చెరువు మరమ్మత్తు పనులను పరిశీలించారు. వర్షాలు వస్తున్న నేపథ్యంలో పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

**ఎస్ఐఆర్ పై ఎవరూ నిర్లక్ష్యంగా ఉండొద్దు.. ఎమ్మెల్యే సునీత**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి ఎవరూ నిర్లక్ష్యంగా ఉండవద్దని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాడర్ కు సూచించారు. కనగానపల్లి మండల కేంద్రంలో స్థానిక మండల నాయకులకు ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు, కో కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జిలు, బూత్ కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లతో పాటు మండల ముఖ్య నాయకులంతా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం గురించి పార్టీ శ్రేణులకు వివరించారు. బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొనే పరిస్థితులు, ఓటరు ధృవీకరణ విధానం, కుటుంబ లింకేజీలు, డ్రాఫ్ట్ జాబితా పరిశీలన, అభ్యంతరాల ప్రక్రియ తదితర అంశాలపై సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఈనెల 15వ తేది నుంచి ప్రారంభమవుతుందని.. క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ 20-25 ఏళ్లకోసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ జరుగుతుందని.. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను చేస్తున్నారని తెలిపారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారని వివరించడం జరిగింది. జులై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాల్సి ఉంటుందన్నారు. దీని పట్ల నిర్లక్ష్యంగా ఉంటే మనకు సంబంధించిన ఓట్లు పోయే ప్రమాదం ఉంది. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కూడా సీరియస్ తీసుకుని పని చేయాలని కోరడంతో పాటు పోలింగ్ బూతుల వారిగా ఓటర్ జాబితాలను నాయకులకు అందజేశారు.



# పార్టీ బలోపేతమే లక్ష్యం ధర్మవరం రూరల్ మండల నాయకులతో 'ఎస్ఐఆర్ ' పై ప్రత్యేక సమీక్ష : క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి

**ధర్మవరం,జూన్08.అక్షర టైమ్స్:** ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు 'ఎస్ఐఆర్ ' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్యా ఢ ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్, మరియు ధర్మవరం నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. ధర్మవరం నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ప్రత్యేక సూచనలను అనుసరించి.. ధర్మవరం రూరల్ మండలానికి చెందిన ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, కో-క్లస్టర్ ఇంచార్జ్‌లు, వార్డ్ ప్రెసిడెంట్లు, వార్డు మెంబర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, మరియు బూత్ ఇంచార్జ్‌లతో కలిసి ధర్మవరం నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి ఆధ్వర్యంలో ఈ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి మాట్లాడుతూ..ఎస్ఐఆర్ ' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని, రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన విధులను ప్రతి ఒక్కరికీ కూలంకషంగా వివరించారు. పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గొట్లూరు సింగల్ విండో చైర్మన్ మేకల రామాంజనేయులు,మండల కన్వీనర్ లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి విజయసారథి,మాజీ మండల కన్వీనర్ గొ ట్లూరు శ్రీనివాసులు, రా0పురం శ్రీనివాసులు, తెలుగు మహిళ వెంకటలక్ష్మమ్మ,,విజయ్ చౌదరి, జంగం నరసింహులు, ఏలుకుంట్ల రమణ, పోతుకుంట రవి, దలవాయి కుళ్ళయప్ప,అదేప్ప,. మల్లేనిపల్లి చంద్ర పార్టీ ముఖ్య నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేయాలని ఆర్డీవో ను కోరిన దివ్యాంగుల హక్కుల పోరాట సాధన సమితి



**గుంతకల్,జూన్08.అక్షర టైమ్స్:-ప్రతినిధి గుమ్మనూరు హరి:** గుంతకల్ పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయం నందు గుంతకల్ ఆర్డీవో శ్రీనివాస్ ని కలిసిన దివ్యాంగుల హక్కుల పోరాట సాధన సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కుల పోరాట సాధన సమితి అధ్యక్షురాలు గుంతకల్ పద్మ మాట్లాడుతూ గుంతకల్ పట్టణ మరియు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దాదాపు 2000 మందికి పైగా దివ్యాంగులు ఉండడానికి ఇల్లు లేక వారు దయనీయమైన జీవితాన్ని గడుపుతున్నారని వారి స్థితిగతులను గమనించి ఆర్ డి ఓ పెద్ద మనసుతో వారికి ఇంటి స్థలాలు కేటాయించడంతోపాటు ఇల్లు నిర్మించుకునేందుకు సహకరించాలని అలాగే వికలాంగుల కాలనీ ఏర్పాటు చేయాలని విన్నవించుకోవడం జరిగింది. సానుకూలంగా స్పందించిన ఆర్డిఓ తప్పకుండా న్యాయం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సాధన సమితి కార్యదర్శులు శోభ, గౌరీ, రాజా,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం లో పంచాయతీ రాజ్ సర్పంచ్ ల సమావేశం





**తాడిమర్రి,జూన్08.అక్షర టైమ్స్:** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ సర్వసభ్య సమావేశం శ్రీకాకుళం జిల్లాలోని ఎస్ వి ఏ గ్రాండ్ హోటల్ నందుసోమవారం జాతీయ పంచాయతీరాజ్ జాతీయ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు ఎలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. అలాగే ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం అధ్యక్షురాలు లక్ష్మీ బిర్రు ప్రతాప్ రెడ్డి, రాజు తెలంగాణ రాష్ట్రం నుంచి నరేంద్ర ,అశోక్ పాల్గొన్నారు. ఈ సమావేశం భాగంగా కొన్ని ముఖ్యమైన అజెండా తీర్మానాలు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ సభ్యులు ఇస్మాయిల్ అజాద్ ,గోనుగుంట్ల భూషణ్ నాయుడు ఉమ్మడి అనంతపురం జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చంపస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# ప్రజాప్రతినిధులారా మా ఇండ్లను కొనండి - ఇక్కడ మేము జీవించలేము

- 50 ఇల్లకు మురికి నీరు వల్ల అనారోగ్యాలు








**పామిడి,జూన్08.అక్షర టైమ్స్:** స్థానిక పామిడి పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో గల 20వ వార్డుకు చెందిన ఎల్ఐసి ఖాజ, మండ్లరాజుల స్వగృహాల ప్రాంతంలో దాదాపు 50 ఇల్ల నివాసకులు మురికినీరు దుర్గంధం తాళలేక ఉన్నామని, వీటివల్ల నివాసము ఇళ్లలోనికి ఈగలు, దోమలు, విషసర్పాలు, కీచకాలు, పందులు ప్రవేశించడంతో దీర్ఘకాల అనారోగ్యాలతో జీవించలేక,బ్రతకలేక,ప్రాణాలు అరచేతిలో ఉంచుకొని కొట్టుమిట్టాడుతున్నామని ఆనివాసాల ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు చెందిన వారు కాయ కష్టములతో జీవించున్నారు. రాత్రి పగళ్ళు కష్టపడిన వారి కష్టార్జితులతో స్వగృహాలు నిర్మించుకున్నామని,1నుంచి 12 సముక్షరాల లోపుగల పిల్లలు దాదాపు 100 మంది పిల్లలు పైగా ఈనివాసాలలో ఉన్నారని, మా నివాసాల మధ్య పామిడి పట్టణంలోని మురికినీరు, వర్షపు నీరు అంతయూ చేరడంతో కుంటలను తలపించే చెరువులుగా ఏర్పడ్డాయని వాపోతున్నారు. ఈ మురికినీరు పోయే కాలువలను అగ్రవర్ణాలు,ధనికులు ఆక్రమించుకున్నారని, ఆ కాలువలో సంపూర్ణంగా పూడిక తీసివేత కల్పిస్తే మురికినీరు తొలగిపోయే అవకాశం ఉందని, ఈ విషయాన్ని సంబంధిత పంచాయతీ అధికారి దృష్టికి తీసుకు వెళ్లిన ప్రయోజనంలేదని, తూతూ మంత్రంతో కన్నీళ్లు తుడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తపరిచారు. ఇదే ప్రాంతంలో సచివాలయం,అంగన్వాడికేంద్రం ఉన్నాయని, ఇక్కడ ఉన్న మురికినీరు కుంటలు పందులకు ఆహ్లాదకరమైన నివాస యోగ్య మైనదని, వీటివల్ల చిన్న పిల్లలకు మలేరియా,టైఫాయిడ్, ఏడెంగ్యూ,మెదడువాపు తదితర విషవ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచిఉందని నివాసకులు ఆవేదన వ్యక్తం చేయుచున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, నియోజకవర్గం ఎమ్మెల్యే, తదితర ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని 50 గృహనివాసుల ప్రాణాలను కాపాడవలసినదిగా అర్థిస్తున్నారు. అలాగే సంబంధిత అధికారులపై తక్షణ చర్యలు తీసుకొని మాకు న్యాయం చేకూర్చాలని,లేదంటే మా గృహాలను కొనుగోలు చేస్తే ఈప్రాంతం వదిలి వేరే ప్రాంతంలోనైనా నివాసాలు నిర్మించుకుంటామని ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. ప్రస్తుతం కురిసిన చిన్నపాటి వర్షానికి కుంటలను తలపించే మురికినీరు చేరడంతో అక్కడి నివాసకులు సతమతమవుతున్నారు.

# శ్రీ చైతన్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి

- 50 వేల రూపాయలు కడతానే విద్యార్థులకు కాట్
- కలెక్టర్సార్ శ్రీ చైతన్య విద్యాసంస్థల మాఫియా నుండి జిల్లా విద్యార్థులను, తల్లిదండ్రులను రక్షించండి
- కాట్ బుకింగ్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థల యాజమాన్యం
- జిల్లా కలెక్టర్ కి ఏఐఎస్బి నాయకులు వినతి



**అనంతపురం,జూన్08.అక్షర టైమ్స్:** ఫీజుల కోసం విద్యార్థి తల్లిదండ్రులను వేధిస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని సోమవారం అనంతపురం జిల్లా కలెక్టర్ కి ఏఐఎస్బి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వి మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి శ్రీ చైతన్య విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా పాఠశాలలు నడుపుతున్నారని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థి తల్లిదండ్రులు మభ్యపెట్టి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా ముందుగా విద్యార్థులకు కాట్ కావాలంటే ముందుగానే మా శ్రీ చైతన్య విద్యాసంస్థలకు 50వేల రూపాయలు చెల్లించాలని విద్యార్థులను విద్యార్థి తల్లిదండ్రులను భయాందోళనకు గురి చేస్తున్నారు అన్నారు. అనంతపురం జిల్లాలో వర్షాలు లేక సరైన పంటలు పండక అరకొరకుగా పండిన పంటలకు కనీస గిట్టుబాటు ధరలు లేక అనంతపురం రైతులు, ప్రజానికం రకరకాల ఇబ్బందులు పడుతున్న సందర్భంలో శ్రీ చైతన్య విద్యాసంస్థలు మాత్రం మీ రైతు కష్టాలు మీ బాధలు మాకు అవసరం లేదు 50వేల రూపాయలు ముందుగానే ఫీజు చెల్లిస్తానే మీకు కాట్ ఇస్తాం అంటూ విద్యార్థులను విద్యార్థి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రైతు కన్నీరు పెట్టుకున్న శ్రీ చైతన్య విద్యా సంస్థల యాజమాన్యం మాత్రం విద్యా సంవత్సరం ప్రారంభం కాకనే 50వేలు ఫీజు కట్టాలని విద్యార్థి తల్లిదండ్రులను వేధిస్తున్నారు. కావున శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం శివారులో శ్రీ చైతన్య విద్యాసంస్థలు నూతనంగా నిర్మిస్తున్న భవనాలు ఇంకా పనులు జరుగుతున్న సందర్భంలోనే ఆ భవనాలకు విద్య శాఖ అధికారులు షిఫ్టింగ్ పర్మిషన్ ఇవ్వడం ఏందని ప్రశ్నించారు. ఆ భవనాలు పూర్తికాకముందే షిఫ్టింగ్ పర్మిషన్ ఇవ్వచ్చా అని వారు విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వ నిబంధనలు పాటించినటువంటి శ్రీ చైతన్య విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకొని అనంతపురం జిల్లాలో ఉన్న ప్రజానీకాన్ని విద్యార్థులని శ్రీ చైతన్య విద్య మాఫియా నుండి కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్బి నగర అధ్యక్షుడు ఇంతియాజ్, నగర ప్రధాన కార్యదర్శి గౌతమ్, మనోజ్ చందు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయ పునఃనిర్మాణంకు చేయూతనివ్వండి



**పామిడి,జూన్08.అక్షర టైమ్స్:** గుంతకల్ నియోజకవర్గం పరిధిలోని పామిడి పట్టణంలో గల శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవాలయము పూర్వం 500 సంవత్సరాల క్రితం వెలసి మహాప్రసిద్ధి చెందిన అతి పురాతన దేవాలయం. ప్రస్తుతం ఆ దేవాలయం శిథిలావస్థకు చేరుకుంది. అందుకని ఆలయ పునఃనిర్మాణంను నిర్మించదలచామని ఆలయ కమిటీ మరియు అర్చకులు భక్తులు తెలిపారు. ఇందులకు దేవాదాయశాఖ వారు సి జి యఫ్ నిధుల కింద 1కోటి 60 లక్షలు మంజూరు చేశారని, దీనికి మ్యాచింగ్ గ్రాంట్ 40 లక్షలు భక్తుల ద్వారా విరాళాలు సేకరించవలసి ఉన్నదని వారు తెలిపారు. కావున దేవాలయ పునఃనిర్మాణమునకు విరాళాలు ఇచ్చి స్వామివారి కృపకు పాత్రులు అవుతుందని మనవి చేసుకున్నారు. పవిత్రమైన దైవ కార్యమును సద్వినియోగం చేసుకోవాలని భక్తాదులను కోరారు.

## కష్టం గా కాదు ఇష్టపడండి

- వీడ్కోలు సభలో కోచ్ భార్గవ్







**తాడిపత్రి,మే08.అక్షర టైమ్స్:** చదువు అయినా ఆటలైన కష్టంతో కాకుండా ఇష్టంతో చేయాలని తాడిపత్రి ఆర్డిటి సబ్ సెంటర్ కోచ్ భార్గవ్ అన్నారు. సోమవారం సాయంత్రం తన వీడ్కోలు సభలో కష్టంగా ఉన్న తాడిపత్రిని వదిలీ పోవాల్సిన పరిస్థితి వచ్చిందని బాధాతప్త హృదయంతో వాపోయారు.విధి నిర్వహణ లో భాగంగా ఆర్డిటి సంస్థ తనను బదిలీ చేసిందన్నారు. అయితే తనకున్న కుటుంబ సమస్యల కారణంగా బదిలీపై వెళ్లలేక ఆర్డిటి కోచ్ పదవికి రాజీనామా చేశానని వీడ్కోలు సభలో అన్నారు. ఆర్డీటీ సంస్థ లో పని చేయడం తన అదృష్టం అన్నారు. ఇక్కడ పని చేయడం వల్లే కోచ్ గా పరిణితి చెందాన న్నారు. ఆర్డీటీ సంస్థ సహకారంతో 'కోచ్ బియాండ్' లెవెల్ వన్ కోచ్ గా అర్హత సాధించానన్నారు. ఈ అర్హతల వల్ల హైదరాబాదు నుండి ప్రముఖ క్రికెట్ అకాడమీలో కోచ్ గా అవకాశం వచ్చిందన్నారు. క్రీడాకారులు ఎదిగే కొద్ది కోచ్ లు మారుతూనే ఉంటారన్నారు. క్రీడాకారులు తమ ఆట తీరును మెరుగుపరుచుకుంటూనే ఉండాలని సూచించారు.

**తాడిపత్రి ద్రోణాచార్యుడు**

తాడిపత్రి క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సాదిక్ వలి, సీనియర్ క్రీడాకారుడు కందన్ తాడిపత్రి ద్రోణాచార్యుడిగా కోచ్ భార్గవ్ ను అభివర్ణించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏ కోచ్ ఇన్ని మ్యాచ్ లను ఆడించి ఉండడని అన్నారు. ఈ మ్యాచ్ లల్లో క్రీడాకారులుపాల్గొనడం ద్వారా 100 వికెట్ల మైలురాయి, వేల పరుగుల మైలురాయి ని పదుల సంఖ్యలో అందుకున్నారంటే కోచ్ భార్గవ్ కు ఆట పై ప్రేమ ఏపాటిదో ఇట్టే అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పాట్ లైట్ అకాడమి చీఫ్ కోచ్ రమేష్, భాష్యం స్కూల్ యజమాని చంద్రశేఖర్ రెడ్డి, నెక్స్ట్ జెన్ అకాడమి కోచ్ అష్రఫ్, వ్యాయామ ఉపాధ్యాయుడు అబ్రహాం, హాజీ, రాజు, అబ్దుల్ తదితరులు ఉన్నారు.

## గుంతకల్ పురపాలక కార్యాలయం ప్రాంగణంలో ఘనంగా 'యోగాంధ్ర-2026' నిర్వహించిన కమిషనర్ లక్ష్మీదేవి





**గుంతకల్,జూన్08.అక్షర టైమ్స్:-ప్రతినిధి గుమ్మనూరు హరి:** గుంతకల్ పట్టణంలో యోగాలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి మరియు యోగ మాస్టర్ మునిస్వామి మరియు మున్సిపల్ సిబ్బందితో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మాస్ యోగా క్యాంపెయిన్ 'యోగాంధ్ర-2026' లో భాగంగా నేడు గుంతకల్ పురపాలక సంఘ పరిధిలో యోగా కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా కమిషనర్ లక్ష్మీ దేవి మాట్లాడుతూ ప్రజల జీవనశైలిలో యోగాను ఒక భాగం చేసి, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడమే 'యోగాంధ్ర-2026' ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జూన్ 7 నుండి జూన్ 21 వరకు రాష్ట్రంలోని అన్ని పురపాలక ప్రాంతాల్లో ఈ యోగా శిక్షణా కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను అలవర్చుకుని సంపూర్ణ ఆరోగ్య వంతులుగా మారాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని, పట్టణ ప్రజలు మహిళలు, యువత, వృద్ధులు అందరూ ఈ యోగా శిబిరాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే యోగ చేస్తే ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం గా జీవించవచ్చు అని చెప్పిన మునిసిపల్ కమిషనర్ లక్ష్మీదేవి ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సిఐ శ్రీరామ్ జన్మదిన వేడుకలు

- శ్రీరామ్ యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రమోద్





**కళ్యాణదుర్గం,జూన్08.అక్షర టైమ్స్:** కళ్యాణదుర్గం పట్టణంలో పులివెందుల సిఐ శ్రీరామ్ పుట్టినరోజు వేడుకలు సిఐ శ్రీరామ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణం లోఘనంగా జరుపుకోవడం జరిగింది. ప్రతి ఏడాది పుట్టిన రోజు సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు పాలు బ్రెడ్లు పంపిణీ, అన్నదానం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు స్వరూప్. ప్రమోద్. వన్నురుస్వామి, వెంకీ, రాము దావిద్ ,హరికృష్ణ, ఓబులేసు, భాగ్యలక్ష్మి, రాము తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి సేవ చేసే గుణమును విద్యార్థులు అలవర్చుకోవాలి

డాక్టర్ బషీర్,డాక్టర్ సోనియా,మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్





**ధర్మవరం,జూన్08.అక్షర టైమ్స్:** సమాజానికి సేవ చేసే గుణమును విద్యార్థులు అలవర్చుకోవాలని స్పందన హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పుట్టపర్తి రోడ్ సాయిబాబా గుడి వద్ద గల స్పందన హాస్పిటల్ లో ఎస్సీ ఎస్టీ కులమునకు చెందిన పదవ తరగతి విద్యార్థులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభను ఏర్పాటు చేశారు. పదిమంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ హాజరు అయినారు. అనంతరం వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులను జీవితములో మరువరాదని, వారి కష్టాన్ని గుర్తించి కష్టపడి ఇష్టపడి చదివినప్పుడే జీవితంలో అనుకున్న లక్ష్యము నెరవేరుతుందని తెలిపారు. సమాజానికి కొత్త తరాల వారు ముందుకు రావాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి మార్కులు ఉండాలని, దాంతోపాటు చదువు స్థాయిలో పటిష్టంగా ఉండాలని వారు తెలిపారు. పేద విద్యార్థులకు చదువు తప్ప మరొకటి ఆధారం లేదని, చదువే జీవితానికి సరైన మార్గము అని వారు స్పష్టం చేశారు. చక్కటి ఆలోచన మంచి నిర్ణయంతో ఉజ్వల భవిష్యత్తు కు పునాది అవుతుందని తెలిపారు. అనంతరం డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కులములో ఎంతోమంది ఆర్థిక పరిస్థితి సరిగా లేక చదువుకోలేకపోతున్నారని, కానీ చదువులో మంచి ప్రతిభ కనబరిచినప్పుడు మా వంతుగా మేము ఆర్థిక సహాయాన్ని అందించడం అనేది మాకెంతో తృప్తిని, సంతోషాన్ని ఇస్తోందని తెలిపారు. వివక్షత అనేది ఉండరాదని, నేటి సమాజంలో సైన్స్ వల్ల భవిష్యత్తులో మార్పు వస్తోందని తెలిపారు. ఆరోగ్యము, మంచి పౌష్టిక ఆహారం ఉన్నంతలోనే మనము భుజించాలని తెలిపారు. అదేవిధంగా శారీరిక శ్రమ ఆరోగ్యములో కీలకపాత్ర వహిస్తోందని తెలిపారు. విద్యార్థులందరూ కూడా శాస్త్రీయ దృక్పథంతో ముందడుగు వేయాలని తెలిపారు. తదుపరి ఎమ్మెల్సీ కే ఆనంద్ డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా పట్టణంలో చేస్తున్నటువంటి వివిధ సేవా కార్యక్రమాలను వారు అభినందిస్తూ, వారికి కృతజ్ఞతలను తెలియజేశారు. ఆర్థిక సహాయం అందుకున్న వారిలో విద్యార్థులు కార్తీక్ సంజయ్ ,అర్చన, శీనై, ప్రవీణ్ కుమార్, సహస్ర, మౌనిక బాయి, నవ్య శ్రీ, సాకే బాలు, శ్రావణి, హర్షిత ఉన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదిశేషు, డాక్టర్ సత్య నిర్ధారణ, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు లోకేష్, చంద్రశేఖర్ రెడ్డి రామాంజనేయులు, సురేష్, వేణుగోపాల్, హాజ్ వలి తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం పట్టణంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్ యాదవ్

- భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి..అధికారులకు మంత్రి ఆదేశాలు
- ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యం
- ప్రజా సమస్యలపై రాజీ లేదు..స్పందనలో వేగం పెంచాలి: మంత్రి సత్యకుమార్ యాదవ్





**ధర్మవరం,జూన్08.అక్షర టైమ్స్:** ధర్మవరం పట్టణంలోని స్థానిక కోర్టు హాల్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక -- పబ్లిక్ గ్రీవన్సెస్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్‌లతో కలిసి మంత్రి ప్రజల నుండి నేరుగా వినతులను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రజల సమస్యలను అధికారులు సున్నితంగా పరిగణించి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం లేదా నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, ప్రజలకు న్యాయం త్వరితగతిన అందేలా పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు ప్రధానంగా రెవెన్యూ, భూ సంబంధిత సమస్యలపై పెద్ద సంఖ్యలో వినతులు సమర్పించారు. భూ హద్దుల వివాదాలు, పట్టాదార్ పాస్‌బుక్స్‌లో పేర్ల మార్పులు, వారసత్వ హక్కుల నమోదు, ఆన్‌లైన్ అడంగల్--రివిజన్ సమస్యలు, భూముల రీసర్వే సమస్యలు, ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రైతుల భూముల సరిహద్దు వివాదాలు, భూమి రికార్డుల సవరణ, సాగుభూములపై హక్కుల అంశాలు వంటి సమస్యలను ప్రజలు మంత్రిగారి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వివిధ గ్రామాల ప్రజలు గృహ స్థలాల కేటాయింపు, రహదారుల నిర్మాణం, తాగునీటి సమస్యలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, ఉపాధి అవకాశాలు, విద్యుత్ సౌకర్యాలు, డ్రైనేజీ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, గ్రామాభివృద్ధి పనులు, రైతు సమస్యలు, కాలువల నిర్మాణం తదితర అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. ప్రజలు అందించిన ప్రతి అర్జీని అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత అని, బాధితులకు న్యాయం జరగేలా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కార మార్గాలను చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశామన్నారు. జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ. రెవెన్యూ మరియు ఇతర శాఖలకు సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నేడు మొత్తం 132 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జాయింట్ కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గ స్థాయి వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు.

# కల్లూరులో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పూర్తి

- శైలజనాథ్ ఉపన్యాసమునకు దద్దరిల్లిన వెన్నుపోటు సభ
- ఇప్పటికైనా మోసం నుంచి మేలుకోండి
- మన హక్కుల కోసం ఆడగండి: శైలజనాథ్






**పామిడి/గార్లదిన్నె,జూన్08.అక్షర టైమ్స్:** గార్లదిన్నె మండలంలోని మేజర్ పంచాయతీ కల్లూరు 44వ జాతీయ రహదారి ప్రక్కన గల స్టార్ ఫంక్షన్ హాల్లో సోమవారం వైయస్సార్సీపి ఆధ్వర్యంలో నిర్వహించిన చంద్రబాబు వెన్నుపోటుకు రెండు సంవత్సరాలు పూర్తి కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. ఈ సందర్భంగా వైసిపి సింగనమల నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ మంత్రి శైలజనాథ్, వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్ర ప్రజలకు లేనిపోని హామీలను గుప్పించి గద్దెనెక్కాడని,ప్రజలను మోసం చేసిన చంద్రబాబునాయుడు వెన్నుపోటుకు పాలనకు రెండు సంవత్సరాలు పూర్తి అయిందని, ఇచ్చిన హామీలను మరచిపోయి వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రశ్నించిన వారిపైన అక్రమ కేసులుపెట్టుతూ కాలం గడుపుతున్నాడని ధ్వజమెత్తారు. ప్రజలారా ఇప్పటికైనా అతని మోసాల నుంచి మేలుకొని మన హక్కుల కోసం కలసికట్టుగా ఎదగాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వల్ల జరిగిన నష్టాలలో రైతులను మోసం చేశాడు,హామీలు అమలు చేయలేదు, యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదు ఉపయోగకరమైన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోని సంక్షేమ పథకాలు నిలిపివేశారు. అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. సవరింపు పేరుతో అవ్వ తాతల పెన్షన్లు తొలగించారు. ఎరువులు ధరలు, కరెంట్ బిల్లును పెంచడం, పెట్రోల్ డీజిల్ ధరలు,గ్యాస్ సరఫరా చేయకపోవడంతో మహిళలు పాతకాలపు కట్టెల పొయ్యి వాడటం, విద్యార్థి దశ నుంచి వృద్ధాప్యం వరకు అన్ని రంగాలలో చంద్రబాబునాయుడు మోసం చేశాడని,కావున మోసాన్ని మరచిపోకండి మంచి భవిష్యత్తు కోసం పోరాడుదాం,మన భవిష్యత్తును మనమే ఎన్నుకుందాం, మాట తప్పని మడమ తిప్పని, సంక్షేమాల మహనీయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తాం భావితరాల అభివృద్ధికి నడుంబిగిద్దామని పేర్కొన్నారు. సంస్థాగత ఎన్నికలలో నాయకులు కార్యకర్తలు అభిమానులు కలిసికట్టుగా ఐక్యంగా పోరాడి అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు.ఓటర్ల జాబితా సవరణలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు అయ్యేలా చూడాలన్నారు. ఈనెల 12వ తేదీ నియోజకవర్గం కేంద్రమైన సింగనమలలో భారీగా ర్యాలీ నిర్వహిస్తున్నామని అందులకు పెద్ద సంఖ్యలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శైలజనాథ్, అనంత వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్ మోహన్ రెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, గార్లదిన్నె నారాయణరెడ్డి తదితర మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు ఈసీడీ పై శిక్షణ




**పెద్దవడుగూరు,జూన్08.అక్షర టైమ్స్:** అంగన్వాడీ వర్కర్ లు అందరూ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సీడీపీఓ షాజిదాబేగం పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని క్రిష్టిపాడు గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఈసీడీ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల చునోవికానికి ఏఐ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతోందని అన్నారు. చిన్నారులల్లో శారీరక, మానసిక అభివృద్ధి లోపాలను గుర్తించడానికి కృషి చేయాలని అన్నారు. 0-0 ఏళ్ళ వయస్సు గల పిల్లలకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో పిల్లలను పరిశీలించి వారికి అందించాల్సిన పౌష్టికాహారం ను గురించి వివరించాలని సూచించారు నవచేతన్ యాప్ ద్వారా వివరాల్లో నమోదు చేయాలని సూచించారు. పిల్లల ఆరోగ్య స్థితులను గురించి తెలియజేయాలని డాక్టర్ శ్రీనివాసబాబు సూచించారు కార్యక్రమంలో సూపర్వైజర్లు నాగేశ్వరి వెంకటలక్ష్మి అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## చేనేత మంత్రి ఇలాఖాలో చేనేత కార్మికుల పెన్షన్ కోసం పడిగాపులు

- ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం



**సోమందేపల్లి,జూన్08.అక్షర టైమ్స్:** 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులు చేనేత పెన్షన్ మంజూరు చేయాలని సోమందేపల్లి ఏమార్వో కి సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం మండల సమితి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు శీలా నారాయణస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు ఎటువంటి పెన్షన్లు మంజూరు చేయడం లేదు, స్థానికంగా చేనేత మినిస్టర్ ఉన్నారని చెప్పుకోవడమే గాని వారి నుంచి చేనేతకు ఎటువంటి లబ్ది చేకూరడం లేదని.ప్రభుత్వం మంజూరు చేస్తున్న పింఛన్ల కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారు, గత ప్రభుత్వ హయాంలో సోమందేపల్లి మండలంలో 411 చేనేత పెన్షన్లు ఉండగా అందులో దాదాపు 200 మందికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేనేత పెన్షన్లు ఇవ్వడం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు ఎటువంటి పెన్షన్లు ఎవరికి ఇవ్వడం లేదు 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు కంటిచూపు సన్నగిల్లి, చేనేత పనిచేయలేక భవన నిర్మాణ కూలీగా వలస పోవడం జరుగుతోంది, నిర్మాణంలో ఉన్న ఏ ఇంటి వద్దకైనా వెళ్లి పరిశీలన చేస్తే అందులో ఇద్దరు ముగ్గురు చేనేత కార్మికులే ఉంటారు కావున కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా చేనేత కార్మికుల కష్టాలు తెలుసుకొని 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు పెన్షన్లు ఇచ్చే దిశగా అడుగులు వేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం సోమందేపల్లి మండల సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం మండల సమితి నాయకులుదాసరి సుధాకర్, మనుతూరి ఈశ్వర్, మాయ కుంట్ల ప్రసాద్, మాయ కుంట్ల నారాయణస్వామి, నిషార్, కోదండ, లక్ష్మీనారాయణ, వడ్డే ఆంజనేయులు పాల్గొనడం జరిగింది.

## రైతులకు సబ్సిడీతో ఎరువులు అందిస్తాం

- చంద్రబాబుది రైతు సంక్షేమ ప్రభుత్వం
- మహమ్మదాబాద్‌లో రైతులకు ఎరువులు పంపిణీ చేసిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



**ఆమడగూరు,జూన్08.అక్షర టైమ్స్:** రైతులకు వ్యవసాయ అవసరాలకు తగిన ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఆమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలో సోమవారం రైతులకు ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి, రైతులకు స్వయంగా ఎరువుల బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి రైతుకు ప్రభుత్వ సబ్సిడీతో నాణ్యమైన ఎరువులు అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డి ఏ పి ఎరువు బస్తా రూ .1350 లతో యూరియా బస్తా రూ. 268 లతో రైతులకు అందిస్తున్నామని అన్నారు. రైతులకు సరిపడేంత ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 120 బస్తాల డిఏపీ (ణూక్రా), 140 బస్తాల యూరియా నిల్వ ఉంచినట్లు చెప్పారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు పనులు చేపట్టే విధంగా అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ గోపాల్ రెడ్డి, ఓడి చెరువు మండల టీడీపి కన్వీనర్ శెట్టి వారి జయచంద్ర,సొసైటీ అధ్యక్షుడు నరేష్ ,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కృష్ణమూర్తి ,స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు,కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## నిడిగల్లులో చెరువు దురాక్రమణ




**తాడిమర్రి,జూన్08.అక్షర టైమ్స్:** తాడిమరి మండలం నిడిగల్లు గ్రామంలో చెరువు దురాక్రమణ జరిగినట్లు స్థానిక తెలుగుదేశం నాయకుడు మారినేని చంద్రశేఖర్. మాజీ సర్పంచ్ వెంకట నాయుడు మరియు గ్రామస్తులు వివరించారు,దాదాపు 40 నుంచి 50 ఎకరాల వరకు బత్తలపల్లి మండలం పశువైద్యాధికారిగా పనిచేస్తున్న గుర్నాథ్ రెడ్డి ఈ భూమిని కొన్నారంటూ అక్కడ జెసిబి లు ట్రాక్టర్లతో పనులు ప్రారంభించాడు విషయం తెలుసుకున్న గ్రామస్తులు పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి పనులునిలిపి చేయించారు,అనంతరం వారు మాట్లాడుతూ చెరువు భూములు ఎవరి సొత్తు కాదని ప్రభుత్వానికి సంబంధించిందని 1972 సంవత్సరంలో ల్యాండ్ సిల్లింగ్ వల్ల మారినేని కుటుంబ సభ్యులు ఈ భూమిని ప్రభుత్వానికి వదిలేసారన్నరు,అప్పటినుండి ఆ ప్రాంతంలో చెరువుఉందన్నారు వర్షపు నీరు కాలువ నీరు ఈ ప్రాంతంలో నిల్వ ఉంటుందన్నారు ఈ భూమిని కోల్పోతే చెరువు స్థలం విస్తీర్ణం తగ్గిపోయి నీటికి అవస్థలు పడాల్సి వస్తుందని వారు తెలిపారు, కావున చెరువు భూములు కాపాడాలంటూ వారు స్థానిక ఎమ్మార్వో కు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు, ధర్మవరం ఎమ్మెల్యే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు ఈ మేరకు సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రామస్తులు చంద్రశేఖర్ మాజి సర్పంచి వెంకట నాయుడు మాట్లాడుతూ జిల్లా అధికారులు వెంటనే తీసుకొని చెరువులు కాపాడాలంటూ ప్రభుత్వానికి దురాక్రమణకు గురికాకుండా చూడాలన్నారు, వంద లాది ఎకరాల భూములకు నీరు అందిస్తూ, జలాలు పెరగడానికి.మూగజీవాలకు పశుపక్షాదులకు నీటి సౌకర్యం పోతుందన్నారు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకొని రక్షించాలని వారు కోరారు